మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట

## బియ్యం సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలి:జిల్లా కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి,జులై 28 ప్రభాతవార్త :** ఖరీఫ్ 2022,23 సీఎంఆర్ డెలివరీలపై సంబంధించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో శుక్రవారం ఉద యం కలెక్టరేట్‌లో విడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష సమావేశం నిర్వహించారు. గత ఖరీఫ్ 2022,23 సిఎంఆర్ డెలివరీలు వేగవంతం



చేయాలని, గడువులోగా ప్రభుత్వానికి బియ్యం పంపణీ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అంతకు ముందు అదనపుకలెక్టర్, అశోక్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ హాతిరాంలతో మిల్లుల వారిగా ఖరీఫ్ 2022, 23 సీఎంఆర్ డెలివరీల స్థితిగతులపై చర్చించిన కలెక్టర్, ఇంకా డెలివరీ మొదలుపెట్టని రైస్ మిల్లులు వెంటనే పంపిణీ మొదలు పెట్టేలాగా అలాగే మొదలుపెట్టిన రైస్ మిల్లర్లు బియ్య పంపిణీ వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైస్ మిల్లర్లకు రోజువారి లక్ష్యాన్ని ఏర్పరచాలని, ఆ లక్ష్యం రైస్ మిల్లర్లు మిల్లింగ్ చేసేలా ప్రతిరోజు రైస్ మిల్లుల ను పర్యవేక్షించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, సివిల్ సప్లై మేనేజర్ హాతి రాం, మూడు ప్రాంతాల ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కలప్ప, రైస్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

## మాయమాటలు చెప్పేందుకు మళ్లీ వస్తున్నారు: మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 28 ప్రభాతవార్త :** ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది మాయమాటలు చెప్పేందుకు, ప్రజలను మభ్యపెట్టేందుకు కొన్ని పార్టీలు సిద్ధమవుతున్నాయని వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలం ధర్మాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో నర్సాపూర్ గ్రామానికి చెందిన బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు చెందిన వెంకటేష్, ఆంజనేయులు, రాములు,కృష్ణయ్య,సహా సుమారు 30మంది బిఆర్ఎస్‌పార్టీ నాయకుడు ధర్మాపూర్ తిరుపతయ్య ఆధ్వర్యంలో మంత్రి సమక్షంలో అధికార పార్టీలో చేరారు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణను అన్ని విధాలుగా అణిచివేసిన బిజె పి, కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడు స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత అభివృద్ధి చెందుతున్న తెలంగాణలో ప్రజలకు మాయమాటలు చెప్పేందుకు వస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలకు తెలంగాణ కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందన్నారు. గతంలో రూ.200ల ఆసరా పింఛన్లు ఇచ్చి వృద్దులు దివ్యాంగులను ఏమాత్రం పట్టించుకోని పార్టీలు కూడా ఇప్పుడు సంక్షేమం గురించి మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. సంక్షేమ పథకాలకు తెలంగాణ కేరాఫ్ అడ్రస్ అని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ ఛైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటి ఛైర్మన్ చెరుకుపల్లి రాజేశ్వర్ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన నాయకులతో మంత్రి

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

### మహబూబ్‌నగర్ ఎస్పీ నరసింహ

**మహబూబ్‌నగర్ బ్యూరో,జూలై28, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ మొక్క లు నాటి వాటినిసంరక్షించాలని ఎస్పీ నరసింహ పిలుపునిచ్చారు. జడ్చర్ల మండల కేంద్రం సమీపంలోని జిల్లా పోలీస్ శిక్షణకేంద్రంలో హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. ఈసందర్భంగా మాట్లాడుతూ హరితహారం చాలాఅద్భుతమైన కార్యక్రమమని ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.డీటీసీలో అధికారులు సిబ్బందితో కలిసి 540మొక్కలు నాటి నీళ్లుపోశారు.మొక్కలను క్రమం తప్పకుండా నీళ్లుపోయాలని,వాటని కంటికి రెప్పలా సంరక్షించాలని సిబ్బందిని ఆదేశించారు.కార్యక్రమంలో ఏఎస్పీ రాములు,ఏఆర్ ఏఎస్పీ సురేశ్‌కుమార్,డీఎస్పీలు మహేశ్,రమణారెడ్డి,శ్రీనివాసులు,సీఐలు,ఎస్సైలు పాల్గొన్నారు.



## నూతన గ్రామ పంచాయతీలకు ఎమ్మెల్యే భూమిపూజ

**ఉట్కూర్,జులై 28 ప్రభాతవార్త :** ఉట్కూర్‌మండలంలోని తిమ్మారెడ్డిపల్లి తండా,లక్ష్మీపల్లి, సమస్తపూర్ గ్రామాల్లో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణం పనులను స్థానిక ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల సమగ్రాభివృద్ధికి బిఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.అందులో భాగంగానే మక్తల్ నియోజకవర్గంలో 41కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు.ప్రభుత్వ నిధుల సద్వినియోగంతో ప్రజలందరు కలిసి మెలిసి గ్రామాలను అభివృద్ధి పరచుకోవాలని, అందుకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట జడ్పీటిసి అశోక్‌గౌడ్, ఎంపిపి ఎల్. కోటిలక్ష్మి, వైసిపి ఎల్లగౌడ్, మాజీ జడ్పీటిసి అరవింద్‌కుమార్, టిఆర్ఎస్ నాయకులు సురేష్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## జడ్చర్ల నల్లకుంటలో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్

**మహబూబ్‌నగర్ బ్యూరో,జూలై 28, ప్రభాతవార్త :** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు నల్లకుంటలో మాజీ ఎమ్మెల్యే,టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఎర్రశేఖర్ పర్యటించారు. శుక్రవారం వర్ష ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. ఇండ్లు కూలిపోయిన బాధితులను పరామర్శించారు. వార్డుల్లో డ్రైనేజీ, రోడ్లు అద్వాన్నంగా ఉన్నాయని స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నల్లకుంటలో పర్యటించి కనీస సాయం అందించకుండా వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించకుండా ఇబ్బందులు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఏరియా దవాఖానలో కూడా కనీస వసతులు లేవని, వెంచర్లకు రోడ్లు వేస్తారు కానీ ఇండ్ల మధ్య ఎందుకు వేయరని ప్రశ్నించారు.



కూలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న ఎర్రశేఖర్

# రైతుల సంక్షేమం కోసం ఉచితంగా 24 గంటల విద్యుత్..!

### రైతు ప్రభుత్వంగా పని చేస్తుంది : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**గద్వాల ప్రతినిధి,జులై 28 ప్రభాతవార్త :** రైతుల సంక్షేమం కోసమే ఉచితంగా 24 గంటల విద్యుత్ ఇస్తూ రైతు ప్రభుత్వంగా పని చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అయిజ, మండలం ఉప్పల గ్రామంలో నిర్మించిన 33/100 కెవి సబ్ స్టేషన్‌ను అలంపూర్ ఎమ్మెల్యే డా. అబ్రహంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణలో కరెంటు కోత, కొరత ఉండదని, ప్రతి రెండు, మూడు గ్రామాలకు ఒక సబ్‌స్టేషన్ నిర్మాణం జరిగితే నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో విద్యుత్ రంగానిది కీలకపాత్ర అందుకే ముఖ్యమంత్రి కెసిఆర్ అడిగిన ప్రతిచోట విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారని అన్నారు. 24 గంటల విద్యుత్ సరఫరా లేకుంటే పరిశ్రమలు, వర్తక, వాణిజ్యాలు, గృహావసరాలు, వ్యవసాయం మూలంగా కోట్లాది మందికి ఉపాధి లభించేది కాదన్నారు. వ్యవసాయ,అనుబంధ, ఐటి, పారిశ్రామిక, వర్తక వ్యాపారాలు గాని, చేతివృత్తులతో ఉపాధి రంగాలలో ఇంత పెద్ద ఎత్తున అందుబాటులో ఉండడం, ముఖ్యమంత్రి కెసిఆర్ ఎంతో ముందుచూపుతో చేసిన పని ఇది అని భారతదేశంలో తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని అన్నారు.తెలంగాణ దరిదాపులలో కూడా ఇతర రాష్ట్రాలు లేవన్నారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగాన్ని బట్టే అంతగా ప్రజల అవసరాలు తీరుతున్నాయని, అన్ని పనులు జరుగుతున్నాయని అభివృద్ధి సూచికలో ప్రధానమైనది విద్యుత్ అన్నారు. రైతులకు ఉచితంగా 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందజేస్తే రైతు ప్రభుత్వంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ఇంతేకాక వ్యవసాయానికి సాగునీందిస్తూ భూములు సస్యశ్యామలం చేస్తున్నట్లు తెలిపారు. వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాలలో తక్కువ వర్షపాతం నమోదైంది. అయినా వర్షాధార పంటలైన పత్తి మొక్కలకు ఎలాంటి ఇబ్బంది లేదని, నెల రోజులు ఈ సారి కాలం ఆలస్యమైందని, రైతులు వ్యవసాయ అధికారుల సూచన మేరకు సాగు చేయాలని, విద్యుత్ వాడకంలో జాతీయ స్థాయిలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని విద్యుత్ వినియోగం ఎక్కువ కావడం వల్ల రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నారాయణపేట, మహబూబ్‌నగర్‌లో వర్షాలు బాగా పడినప్పటికి వనపర్తి, నాగర్‌కర్నూల్,గద్వాలలో వర్షపాతం తక్కువగా ఉందని అన్నారు. ప్రస్తుతం వరి పంట వేయడానికి ఆలస్యమైనందున ఇతర పంటలైన మెట్ట పంటలు వేసి రైతులు అభివృద్ధి చెందవచ్చుని తెలిపారు. వ్యవసాయాధికారుల సూచనలు పాటించి రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం, ఆర్డీఓ చంద్రకళ, సంబంధిత అధికారులు , తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభిస్తున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే అబ్రహాం

# కృష్ణానది పరివాహక ప్రాంతాన్ని సందర్శించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**వరద ఎంత వచ్చినా ప్రమాదాలు జరగకుండా చూడాలి**
**త్వరలోనే హరిత హోటల్ ఏర్పాటు చేస్తాం**

**నారాయణపేట ప్రతినిధి,జులై 28 ప్రభాతవార్త :** తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న సందర్భంగా ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మక్తల్ నియోజకవర్గంలోని పసుపుల దగ్గర కృష్ణానది పరివాహక ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల ద్వారా ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాముల ద్వారా పెద్ద ఎత్తున నీటిని విడుదల చేయడం జరిగిందని ఆ నీటి ప్రవాహం మన కృష్ణానదికి భారీగా వస్తున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ప్రాణ,ఆస్తినష్టాలు జరగకుండా ఏర్పాట్లు చేయాలని జిల్లాకలెక్టర్‌ను ఆదేశించారు.అదే విధంగా గతంలో జరిగిన పొరపాట్లను సమీక్షించు కుంటూ అవి జరగకుండా ప్రత్యేక బందోబస్తు నిర్వహించాలని జిల్లాఎస్పీని ఆదేశించారు.స్థానిక ఎమ్మెల్యే చొరవతో ఇక్కడ బోటు నిర్వాహకులకు త్వరలో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. భారతదేశంలో ప్రసిద్ధి గాంచిన దేవాలయాల్లో వల్లభాపురం దత్తాత్రేయ స్వామి దేవాలయం కూడా ఒకటి ఉండడం సంతోషకరమని అలాంటి దేవాలయాలకు సందర్శకుల తాకిడి తగ్గించుకోవాలని ఒకవేళ ఎవరైనా వస్తే వారికి ఉండడం కోసం వసతి ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే ఇక్కడ పెద్దఎత్తున హరిత హోటల్ కూడా ఏర్పాటు చేయడం కొరకు రాష్ట్ర ముఖ్యమంత్రితో సంప్రదిస్తామని అన్నారు. నది పరివాహక ప్రాంతంలో ఉండే రైతులు, మత్స్యకారులు నది లోపలికి చేపల వేటకు వెళ్లకుండా ఉండాలని ఫ్లో రోజు రోజుకు పెరుగుతున్న కొద్ది ప్రత్యేకంగా అధికారుల గస్తీ ఎక్కువగా ఉండాలని స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అన్నారు.వారి వెంట మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా ఎస్పీ వెంకటేశ్వర్లుతో పాటు జిల్లా అధికారులు, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.





కృష్ణా నది పరివాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# జలసవ్వడి..

- ప్రాజెక్టులు, చెక్ డ్యాంలకు జలకళ
- ఎగువన కురుస్తున్న వర్షానికి జూరాలకు వరద
- జూరాల 22గేట్లు ఎత్తి దిగువకు నీటివిడుదల
- దుందుభికి పోటెత్తిన వరద

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 28, ప్రభాత వార్త :** ఎగువన కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణానదికి వరద పోటెత్తుతున్నది. కర్ణాటకలోని నారాయణపూర్ ప్రాజెక్టుకు లక్షన్నర క్యూసెక్కులకు పైగా వరద వస్తుండడంతో దిగువకు నీటి విడుదల చేశారు. గేట్లు ఎత్తివేయడంతో జూరాలకు బిర బిరా కృష్ణమ్మ పరుగులు తీస్తున్నది. దీంతో జూరాలకు శుక్రవారం వరద ఉధృతి పెరగడంతో 22గేట్లు ఎత్తి దిగువన శ్రీశైలం జలాశయానికి నీటి విడుదల చేశారు. భారీ వర్షాలతో లక్షా 20వేల క్యూసెక్కులకు పైగా వరద వస్తుండగా 83వేల క్యూసెక్కుల నీటిని కిందకు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. దీంతోపాటు నెట్టెంపాడు,భీమా లిఫ్ట్ ద్వారా దిగువకు నీటి విడుదల కొనసాగుతున్నది. కోయిల్ సాగర్ ఎగువ ప్రాంతాన కురుస్తున్న వర్షాలకు భారీగా వరద చేరుతున్నది. చాలా చోట్ల వాగులు, చెక్ డ్యాంలు అలుగులు పారుతున్నాయి.



రఘుపతి పేట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభి

**దుందుభి ఉధృతి..**

దుందుభి నది శుక్రవారం ప్రమాద కరస్థాయిలో ప్రవహించింది. వాహనదారులు అతి కష్టం మీద వాగు దాటుతూ ఇబ్బందులు పడ్డారు. జడ్చర్ల మండలంలో కొండేడ్ మొన్న వాగు దాటుతూ ఇద్దరు కొట్టుకుపోయి ప్రాణాలు విడిచిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కలెక్టర్ జి రవినాయక్, ఎస్పీ నరసింహ దుందుభిని – మిగతా2లో..

## త్యాగానికి ప్రతీకలు పీర్లు!!

**తెలంగాణ మతసామరస్యానికి ప్రతీక పీర్లపండుగ**
**దట్టమైన ఊదుపొగలు.. డప్పుల మోతలు**
**అలయ్ బలయ్ ఆటలు పీర్లపండుగ ప్రత్యేకతలు.. నేడే పీర్ల పండుగ**

**భూత్పూర్,జులై 28 ప్రభాతవార్త :** డప్పుల మోతలు ఊపిరి సల్పని దట్టమైన ఊదుపొగలు చర్నాకొలల ఝూలిఝులలు అలయ్ బలయ్ కోలాటాలు ఇవే పీర్ల పండగ ప్రత్యేకతలు. తెలంగాణ కుల, మతాలకతీతంగా జరిపే అతిపెద్ద పండగ పీర్ల పండుగ. హాసన్ హుస్సేన్ అనబడే ఇద్దరన్నదమ్ముల వీరోచిత పోరాటం వారి ఆత్మ బలిదానం, త్యాగఫలితం,వారం ఫంజాల ప్రదర్శనే పిరీలు. పద్నాల్గవ శతాబ్దంలో ఇద్దరు ముస్లిం హిసాన్, హుసేన్ అనబడే ఇద్దరు సోదరులు తమ వంశీయుల్ని కాపాడుకునేందుకు కర్బలా మైదానంలో వీరోచితంగా పోరాడి ప్రాణాలు వదిలారు. వీరి ప్రాణ త్యాగాలకు నిదర్శనంగా ప్రతి ఏటా ముస్లింలు ఆసుర్ ఖానాలో హాసన్, హుస్సేన్‌లతో పాటు ప్రాణత్యాగాలు చేసిన ఇమామ్, ఆలేభాష్, ఖాసీం వంటి మరికొందరి ఫంజాలను మసీద్ (ఆసుర్ ఖానా) ప్రతిష్ఠించి పది రోజుల పాటు శోకదినాలుగా పరిగణిస్తూ తమ సంతాపం ప్రకటిస్తారు. ఇక తెలంగాణలో ఈ మొహర్రంను మత సామరస్యానికి నిదర్శనంగా నిర్వహిస్తారు. ముస్లింలు లేనిచోట హిందువులే పీరిలను మసీదులలో (ఆసుర్‌ఖానా) ప్రతిష్ఠించి పదిరోజులు అలాయి బలాయి ఆడుతూ ఆట పాటలు, డప్పులు, గజ్జెల మోతతో అసయి దూల ఆరతి కాళ్ల గజ్జల గమ్మతి అంటూ అలై చుట్టు తిరుగుతూ పీర్ల పండగను జరుపుతారు. ముస్లింలలో కొన్ని తెగలవారు గుండెలు బాదుకుంటూ రక్తాన్ని చిందిస్తూ పీర్ల ఊరేగింపు నిర్వహిస్తారు. ఇలా పదిరోజుల పాటు శోకదినాలు పాటిస్తూ పదోరోజు పీరిలను బావి, కొలను దగ్గరకు తీసుకువెళ్లి దట్టీలు, ఫంజాలను శుభ్రంగా కడిగి మళ్లీ వచ్చే ఏడాదివరకు వాటిని పెట్టెలలో భద్రంగా ఊటరేలలో దాని ఉంచుతారు. ముస్లింల అరబీ క్యాలెండర్ ప్రకారం మొహరం నెలవంక దర్శనం నుంచే పీర్ల పండగను జరుపుతూ వారి తొలిసంవత్సరం ఆరంభమవుతుందని చెబుతారు.



## రూ.140 కోట్లతో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు

**47వ వార్డులో రూ. 1.40 కోట్లతో సిసి రోడ్లు, డ్రైనేజీ పనులకు**
**శంకుస్థాపన : వార్డు పర్యటనలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్**



వార్డులో పర్యటిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్‌బ్యూరో,జులై 28 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు రూ. 140 కోట్లతో మరమ్మతులు చేయడంతో పాటు పట్టణంలో అన్ని రోడ్లను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతామని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని 47వ వార్డు పరిధిలో ఉన్న హనుమాన్‌నగర్, వివేకానంద నగర్ కాలనీలలో వార్డు పర్యటన నిర్వహించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. రూ.1.40కోట్లతో సిసి రోడ్లు,డ్రైనేజ్, కమ్యూనిటీ హాల్ నిర్మాణపనులకు శంకుస్థాపన చేశారు.ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా కేంద్రం అభివృద్ధి కోసం ఇప్పటికే పెద్ద ఎత్తున నిధు లను తీసుకొచ్చామని అవసరమైతే మరిన్ని నిధులు కూడా తీసుకువస్తామని తెలిపారు. ఇప్పటికే రూ.140 కోట్లతో పనులు చేపట్టామన్నా రు. వార్డు పర్యటనల సందర్భంగా స్థానికుల సమస్యలను తీర్చేందుకు రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ తదితర అధికారులు, సిబ్బంది సైతం ఉంటున్నారని,ఎక్కడికక్కడే సమస్యల పరిష్కారం చేస్తున్నామన్నారు. మహబూబ్‌నగర్ రూపురేఖలు మార్చడమే ధ్యేయమని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు. అనేక కార్పోరేట్ కంపెనీలు సంస్థలు జిల్లా కేంద్రానికి తరలి వస్తున్నాయని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. మున్సిపల్ ఛైర్మన్ కెసి నర్సింహులు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ గణేష్, కమిషనర్ ప్రదీప్ కుమార్, స్థానిక కౌన్సిలర్ గోవిందు, బిఆర్ఎస్ పార్టీ వార్డు అధ్యక్షుడు బాలస్వామి, రామకృష్ణ, అధికారులు ఉన్నారు.

# అలుపెరుగని రాజకీయ యోధుడు సూదిని జైపాల్‌రెడ్డి..

### కేంద్రమాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి 4వ వర్ధంతి వేడుకలు



సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి



జైపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



కల్వకుర్తిలో జీఎస్ఆర్ కార్యాలయంలో సూదిని జైపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, జులై 28, ప్రభాతవార్త:**విద్యార్థి దశ నుంచి చివరి శ్వాస వరకు విలువలతో కూడిన రాజకీయం చేసిన గొప్ప వ్యక్తి అని, ఎంతో మంది రాజకీయ నాయకులకు రాజకీయ గురువు సూదిని జైపాల్‌రెడ్డి అని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపర మేధావి, రాజకీయ దురంధురుడు, ఆధునిక చాణుక్యుడు, ఉత్తమ పార్లమెంటెరియన్, నడిచే గ్రంథాలయమని స్వర్గీయ కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి అని వారు కొనియాడారు. శుక్రవారం కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి 4వ వర్ధంతి వేడుకలను పురస్కరించుకొని మాడ్గుల మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వకుర్తి అభివృద్ధి కోసం ఎంతో పాటు పడ్డారని, ప్రతి ఒక్కరు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.ఆయన ఎమ్మెల్యేగా,లోక్‌సభ, రాజ్యసభ,ఎంపీగా,కేంద్రమంత్రిగా సుదీర్ఘకాలం ప్రజల మనసులో చిరకాలం గుర్తుండేలా ప్రజా సేవ చేసిన గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రసాధనలో జైపాల్‌రెడ్డి పాత్ర మరువలేనిదని, ఆయన పట్టుదలతోనే తెలంగాణ సాధించుకున్నామని,ప్రతిఒక్కరు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూదిని రాంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, భట్టు కిషన్‌రెడ్డి, బొజ్జ మోహన్‌రెడ్డి, శ్రీపతి శ్రీనివాస్‌రెడ్డి, సూదిని కొండల్‌రెడ్డి, యాదయ్యగౌడ్, మర్రెడ్డి, జగన్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, ఓం ప్రకాష్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పబ్బు యాదయ్యగౌడ్, కొప్పుల వెంకటయ్యగౌడ్, లక్యానాయక్, నరసింహ తదితరులు ఉన్నారు.



వెల్దండలో సూదిని జైపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో...**

పాలమూరు పల్లె నుంచి ఢిల్లీకి వెళ్లినా...దేశంలోనే అత్యంత ప్రత్యేక రాజకీయ నేతగా గుర్తింపు తెచ్చుకున్నారని, ఆయన పాలమూరుకు వస్తే చాలు తెలిసిన వాళ్లని పేర్లతో, వరుసలతో పిలుస్తూ అందరిని ఆశ్చర్యపరిచేవారని డీసీసీ జిల్లా అధ్యక్షులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 4వ వర్ధంతి సందర్భంగా సూదిని జైపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్ననాటి మిత్రులే కాదు,గ్రామస్తులు,సహాధ్యాయులు, రాజకీయాల్లో, ఇతర అనేక సందర్భాల్లో తారస పడ్డవాళ్లందరిని గుర్తు పెట్టు కోవడం, పలకరించడం జైపాల్‌రెడ్డి ప్రత్యేకత అని ఆయన తెలిపారు. జైపాల్‌రెడ్డి అసెంబ్లీలో ఉన్నా... పార్లమెంట్‌లో ఉన్నా... సభ, సమావేశం ఎక్కడ మాట్లాడిన సరే ... ప్రతిపక్షాల నేతలు, సీఎంలు, పీఎంలు సైతం అత్యంత సావధా నంగా వినేవారన్నారు. ఇక ప్రజలైతే ఆయన వాదనలకు, ఆయన మాటలకు ఫిదా అయ్యేవారన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించి తెలంగాణ రాష్ట్ర సాధనలో కార్యన్మోఖుడయ్యారని కొనియాడారు. ఓనమాలు నేర్చిన పార్టీలోనే తనువు చాలించారని, ఆయన దేశానికి, రాష్ట్రానికి ఎన్నో సేవలు చేశారన్నారు.కాంగ్రెస్ పార్టీలో ఉండి కాంగ్రెస్ పార్టీ తరుపున గెలిచి సొంత లాభాల కోసం ఇతర పార్టీల్లోకి వెళ్తున్నారని, ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసిన వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని ఎవరు ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, పుస్తకాల రాహుల్, శ్రీధర్‌రెడ్డి, గోపాల్, ఖదీర్, గణేష్, షాకేర్, సైదులు, దామోదర్‌రెడ్డి, ముత్యాల్‌రెడ్డి, గణేష్, సుదర్శన్, ఆంజనేయులు, మహమూద్, కాంగ్రెస్ అనుబంధా సంఘాలు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు తదితరులు ఉన్నారు.

**బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో...**

జాతీయ భావజాలంతో ఉన్నత స్థాయికి ఎదిగిన కల్వకుర్తి మట్టి బిడ్డ, ఉత్తమ పార్లమెంటరీయన్ సూదిని జైపాల్‌రెడ్డి అని మాజీ సర్పంచ్‌లు బృంగి ఆనంద్‌కుమార్, సుదర్శన్‌రెడ్డిలు అన్నారు. కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి 4వ వర్ధంతి వేడుకలను కల్వకుర్తి పట్టణంలోని జీఎస్ఆర్ కార్యాలయంలో నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్వకుర్తి ఎమ్మెల్యేగా, రాజ్యసభ సభ్యులుగా, పార్లమెంట్ సభ్యులుగా పనిచేసి, ఏ హోదాలో పనిచేసిన పదవికి వన్నె తెచ్చిన మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. దేశ రాజకీయాల్లో లౌకిక, జాతీయ భావజాల స్ఫూర్తితో వ్యక్తిత్వ రాజకీయాల కంటే సిద్ధాంతాలు, విలువలు, పునాదులతో కూడిన రాజకీయాలతో ఉన్నత స్థాయికి ఎదిగిన మహోన్నత నాయకులల్లో జైపాల్‌రెడ్డి ఒక్కరని ఆయన తెలిపారు. దేశ వ్యాప్తంగా ఎన్నో ప్రజా సంక్షేమ పథకాల్లో పెను మార్పులు చేపట్టి సాంకేతిక పరిజ్ఞానం జోడించి సామాజిక అభివృద్ధికి దోహదపడిన నాయకుడిగా జైపాల్‌రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోతారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ షాన్‌వాజ్ ఖాన్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, పర్వతాలు, హన్మనాయక్, చిన్న దున్న సురేష్ తదితరులు ఉన్నారు.

**వెల్దండ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..**

తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రత్యేక క్రీయా శీలక పోషించిన అపరమేథావి కేంద్ర మాజీ మంత్రి స్వర్గీయ సూదిని జైపాల్‌రెడ్డి అని వెల్దండ మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోతిలాల్‌నాయక్ అన్నారు. వెల్దండ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సూదిని జైపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో అపరమేధావిగా పేరొందిన జైపాల్‌రెడ్డి కల్వకుర్తి బిడ్డగా పుట్టడం మనందరి అదృష్టమన్నారు. నిలువెత్తు రాజకీయాలకు నిదర్శనం జైపాల్‌రెడ్డి అన్నారు.

జైపాల్‌రెడ్డి ముందు చూపుతూ సాగునీటి ప్రాజెక్టురూ పకల్పన చేయడమే కాకుండా నియోజకవర్గ స్థాయిలో తాగు నీటి దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వ నిధులను కేటాయించి గ్రామీణాభివృద్ధికి పెద్ధపీట వేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైపాల్‌రెడ్డి రూపంలో పనులు జరగడం మరిచిపోలేని గుర్తులని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పర్వత్‌రెడ్డి, మట్ట వెంకటయ్యగౌడ్, పంతులానాయక్, శేఖర్, పుల్లయ్య, శ్రీనివాస్‌యాదవ్, ఎర్ర శ్రీను, జయరాంనాయక్, తిరుపతిరెడ్డి, రాహుల్, చెన్నయ్య తదితరులు ఉన్నారు.

## 24.3 ఫీట్లకు చేరిన కోయిల్‌సాగర్ నీటిమట్టం

**కోయిలకొండ,అంకిళ్ల వాగుల నుండి వచ్చి చేరుతున్న నీరు**

**దేవరకద్ర,జూలై 28 ప్రభాతవార్త:** జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్‌లో రోజురోజుకు నీటిమట్టం పెరుగుతుంది. తీలేర్ పంప్‌హౌజ్ నుండి ప్రాజెక్టుకు కృష్ణజలాల తరలింపు ఇటీవల నిలిపివేశారు.వర్షాలు పడుతుండటంతో వాటిని నిలిపివేశారు. వర్షాలు కురుస్తుండటంతో కోయిలకొండ,అంకిళ్ల వాగుల నుండి ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరడం ప్రారంభమైంది.దీంతో శుక్రవారం సాయంత్రం నాటికి ప్రాజెక్టులో నీటిమట్టం 24.3 ఫీట్లకు చేరింది. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ స్థోమత 32.5 ఫీట్లు. ఇంకా 8.2 ఫీట్ల మేర నీరు వచ్చి చేరితే ప్రాజెక్టు షెట్టర్లను తెరుస్తారు. ప్రాజెక్టులోకి కొత్త నీరు వచ్చి చేరుతుండటంలో కోయిల్‌సాగర్‌కు జలకళ వస్తుంది. ప్రాజెక్టును చూడటానికి వచ్చే పర్యాటకుల సంఖ్య కూడ క్రమేపి పెరుతుంది.



## ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేపట్టాలి..

**- 30న సన్నాహక మహాసభ**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 28, ప్రభాతవార్త :** మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఆగస్టు రెండో వారంలో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సన్నాహక మహాసభ జడ్చర్ల మండల కేంద్రంలో ఈనెల 30న నిర్వహించనున్నట్లు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి సతీశ్‌మాదిగ తెలిపారు. రాజాపూర్ మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వరూప మహాసభను నిర్వహించకముందే రానున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. సన్నాహక సభకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వేలాదిగా నాయకులు, మాదిగలు తరలిరావాలని పిలుపునిచ్చారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మహాజన సోషలిస్టు పార్టీ సభ్యులు సభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం టైగర్ జంగయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## జూలై, ఆగస్టు మాసాలలో చేపలను పట్టకుండా చూడాలి

**మత్స్యశాఖ అధికారి రాణాప్రతాప్**



**నారాయణపేట ప్రతినిధి,జూలై 28 ప్రభాతవార్త :** జులై, ఆగస్టు మాసాలలో చేపల సంతానోత్పత్తి కా లాన్ని పురస్కరించుకుని నదులు, రిజర్వాయర్లలో చేపల వేట నిషేధించామని జిల్లా మత్స్య శాఖ అధికారి ఎన్. రాణాప్రతాప్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మత్స్య కార్మికులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రస్తుతం వర్షాలు బాగా కురుస్తున్నందున చెరువులు,నదులు,రిజర్వాయర్లు, కాలువలలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని ప్రమాదాల బారి నుండి అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రజల ప్రాణాలు చాలా విలువైన వని వారి ప్రాణాలను వారు కాపాడు కోవాలని అధికారుల సూచనలను పాటిస్తూ రక్షించుకోవాలని అన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

**దేవరకద్ర,జూలై 28 ప్రభాతవార్త:** దేవరకద్రలో శుక్రవారం బీఆర్ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కుర్వ కెంగూరిశ్రీకాంత్‌యాదవ్ బాధితుడికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందజేశారు. దేవరకద్ర మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన రాజేందర్‌కు రూ.30వేల విలువైన ఈ చెక్కును శ్రీకాంత్‌యాదవ్ అందజేశారు.దీంతో బాధిత కుటుంబసభ్యులు ముఖ్యమంత్రి,ఎమ్మెల్యేఆలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవరకద్ర పీఏసిఎస్ చైర్మెన్ దోకూర్ నరేందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మెన్ దోబ్బలి అంజనేయులు,బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మున్నూరు బాల్‌రాజ్, సర్పంచ్ హన్మంతు,నారాణచారి తదితరులు పాల్గొన్నారు.



## దళిత జర్నలిస్టు ఆత్మగౌరవ సభ కరపత్రాలు విడుదల

**గద్వాల ప్రతినిధి,జూలై 28 ప్రభాతవార్త :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరగబోయే దళిత జర్నలిస్టుల ఆత్మగౌరవ సభ కరపత్రాలను శుక్రవారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చేతుల మీదుగా విడుదల చేయించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వాలకు వారదిగా ఉంటూ తమ కర్తవ్యాన్ని నిర్విఘ్నంగా చాటుకునేది జర్నలిస్టులు అని అన్నారు. జర్నలిస్టుల సమస్యల పట్ల నా వంతుగా సహకరిస్తానని అన్నారు. ఈసందర్భంగా తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల ఫోరమ్ రాష్ట్ర చైర్మెన్ గట్టు తిమ్మప్ప, జిల్లా గ్రంథాలయ చైర్మన్ జంబు రామన్‌గౌడ్, మల్దకల్ మండల సింగిల్ విండో చైర్మన్ తిమ్మారెడ్డి, దళిత జర్నలిస్టుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కాకపోగు జాన్, జిల్లా అధ్యక్షుడు డి.వెంకటన్న, ప్రచార కార్యదర్శి బిజ్వారం తిరుమలేష్ పాల్గొన్నారు.



## బస్టాండ్ నిర్మాణం కోసం తహసిల్దార్‌కు వినతి పత్రం

**మాగనూరు,జూలై 28 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన బస్టాండ్ లేక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే ఆర్టీసి అధికారులు స్పందించి బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని తహసిల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్సులు కూడా ఎక్కడపడితే అక్కడ ఆగుతున్నాయి కనుక మండల కేంద్రమైన మాగనూరు గ్రామంలో తప్పకుండా బస్టాండ్ ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాలరాజు అన్నారు. బస్టాండ్ నిర్మాణం వెంటనే జరగకపోతే ధర్నాకు కూడా వెనకాడబోమని అన్నారు. బస్టాండ్ లేని కారణంగా వేరే గ్రామాల నుండి వచ్చిన ప్రజలు కాలకృత్యాలుకు ఇబ్బందులు పడుతున్నారని వీలైనంత తొందరగా సమస్యను తీర్చాలని విన్నవించారు. జిల్లా కలెక్టర్, ఆర్టీసి అధికారులు స్పందించి బస్టాండ్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాగనూరు మండల అధ్యక్షులు నరేష్‌కుమార్, నర్సిలు, సాకేత్, రాఘవేంద్ర పాల్గొన్నారు.




## నిర్వాసితులకు అండగా ఉంటా...

**-ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు**

**అచ్చంపేట, జూలై 28 ప్రభాతవార్త:**భూములు కోల్పోయిన రైతులకు అండగా ఉండి వారిని కాపాడుకుంటానని ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పేర్కొన్నారు. శుక్రవారం అచ్చంపేట మండలం పులిజాల గ్రామంలో కేఎల్ఐ కాల్వల ద్వారా భూములు కోల్పోతున్న రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులిజాల గ్రామంలో 2 కిలో మీటర్ల మేర కాల్వ తీసి గిరాయికుంటను నింపితే సుమారు 600 ఎకరాలకు సాగునీరు అందించేందుకు వీలుంటుందని, రైతులు ముందుకు రావాలని కోరారు. రైతులకు సాగు నీరు అందించి రైతులను రాజులు చేయడమై ఏకైక లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. భూములు కోల్పోతున్న రైతులు మాట్లాడుతూ నీళ్ల ముఖ్యమని, భూములు పోయిన పర్వలేదని, మా వల్ల ఇతర రైతులకు మేలు జరుగుతుందంటే భూములు ఇవ్వడానికి మేము సిద్ధంగా ఉన్నామని రైతులు ముందుకొచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సీఎం కేసీఆర్ రైతులను కేంద్రంగా చేసుకొని పాలన కొనసాగిస్తుండటంతో తెలంగాణ రైతులు దేశానికి అన్నం పెట్టే స్థాయికి ఎదిగారని ఆయన అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పర్వతాలు, పీఏసీఎస్ చైర్మన్ రాజిరెడ్డి, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, లోక్యనాయక్, రమేష్‌రావు, రామాచారి, నారాయణరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ మల్లేష్, రవి, గంగయ్య, మురళి, మధుసూదన్ తదితరులు ఉన్నారు.



# అప్పుల ఊబిలో విత్తనపత్తి రైతులు..!

**ఏళ్లుగా విత్తన పత్తిని సాగు చేస్తున్నా రైతులకు అంతా నష్టమే**

**మరోవైపు దళారుల చేతుల్లో భూములు కోల్పోతున్న రైతులు**

**నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్**

**ధరూర్,జూలై28 ప్రభాతవార్త:**మండల పరిధిలోని పెద్దపాడు, చిన్నపాడు, పార్చర్ల, సోంపురం, మన్నాపురం, ధరూర్, దోర్నాల గ్రామాల మీదుగా నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా ఛైర్మన్ గొంగ్ల రంజిత్‌కుమార్ విత్తనపత్తి రైతులతో మాటమంతి కార్యక్రమం నిర్వహించి సీడ్‌పత్తి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ధరూర్ మండలంలోని ఆయా గ్రామాలలో విత్తనపత్తి రైతులపొలాలకు వెళ్లి వారితో మాట్లాడి, విత్తన పత్తి సాగులో వారి కష్టాలను తెలుసుకున్నారు. అనంతరం ధరూర్ శివారులోని ఓ వ్యవసాయ పొలంలో జిల్లా ఛైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్ రైతులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఏళ్లగా విత్తనపత్తి సాగు చేస్తున్న అప్పులపాలవుతున్నామని, ఒకవైపు పెట్టుబడులు, కూలీలు రేట్లు పెరుగుతున్నా, విత్తనపత్తి ప్యాకెట్‌పై ధరలు మాత్రం పెరగడం లేదని మరోవైపు మధ్య దళారుల చేతుల్లో వడ్డీల పేరున కమిషన్ల పేరున, ఫెయిల్ కాకున్న కూడా ఫెయిల్ అయినట్లు చెబుతూ దోపిడికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరి అప్పులపాలై నష్టం వస్తున్నట్లయితే విత్తనపత్తి ఎందుకుసాగు చేస్తున్నారని రంజిత్‌కుమార్ రైతులను ప్రశ్నించగా అప్పులు కట్టడానికి విత్తనపత్తిని సాగు చేస్తున్నామని ఒకవేళ సాగు చేయకపోతే ఆర్గనైజర్లు మా అప్పులు కట్టాలని మా ఇండ్ల ముందుకు వస్తున్నారని అన్నారు. మా నాన్న విత్తన పత్తిని సాగు చేస్తూ చేసిన అప్పులను మేము తీర్చడానికి విత్తన పత్తిని సాగు చేస్తున్నామని అన్నారు. చిన్నపాడులో వెంకటేష్ అనే రైతు 3లక్షల రూపాయలకు 2 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేసుకోగా మళ్లీ అట్టి డబ్బును కడతామని చెప్పిన కూడా భూమిని తిరిగి ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, జిల్లా నాయకులు నాగేష్‌యాదవ్, ఆలూరు వెంకట్రాములు, ధరూర్ మండల అధ్యక్షుడు నెట్టెంపాడు గోవిందు, ఉపాధ్యక్షులు మునెప్ప, ఆంజనేయులు, సహాయ కార్యదర్శులు తిప్పన్న, రామకృష్ణ నాయకులు అడవి ఆంజనేయులు, జగదీష్, కృష్ణ, మల్దకల్ భరోసా ఆంజేయులు, దరెప్ప, మల్దకల్ మండల అధ్యక్షుడు విష్ణు, కార్యదర్శి తిమ్మప్ప, నాయకులు లక్ష్మన్న, నేతన్న,గోపాల్, ఆశన్న, భూపతి, వీరేష్, కెటిదొడ్డి, మండల సమన్వయకర్తలు అంజి, దస్తగిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



విత్తనపత్తి పంటను పరిశీలిస్తున్న గొంగళ్ల రంజిత్‌కుమార్



రైతులతో మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

## నర్వ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ సత్యనారాయణ



మొక్క నాటుతున్న డీఎస్పీ



పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ

**నారాయణపేట ప్రతినిధి,జూలై 28 ప్రభాతవార్త :** జిల్లాలోని నర్వ పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ కె. సత్యనారాయణ వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం తనిఖీ చేశారు. ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు.అనంతరం పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు పోలీస్ స్టేషన్ పరిశుభ్రంగా ఉంచాలని, వారానికి ఒకసారి శ్రమదాన కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. పోలీసులు ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని బాధితులు ఏ సమయంలోనైనా పోలీస్ స్టేషన్‌కు వస్తే అందరికి సమాన న్యాయం అందేలా చూడాలని, బాధితులు తీసుకువచ్చే ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్‌లో ఉంచరాదని సూచించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిధిలో ముందస్తు చర్యలు, అక్రమ వ్యాపారాలు చేసే వారిపై, రౌడీలు,సస్పెక్ట్స్ వారి కదలికలపై నిఘా ఏర్పాటు చేసి ప్రతిరోజు వారిని తనిఖీలు నిర్వహించాలి. పోలీస్ స్టేషన్‌లో పెండింగ్ ఫైల్స్‌ను తనిఖీ చేసి పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వర్టికల్స్ నిర్వహణ, హెచ్ఆర్ఎంఎస్, ఆన్‌లైన్ వినియోగించే విధానం , టిఎస్ కాప్స్ న్‌లైన్‌లో కేసుల వివరాలు నమోదు చేసే మొదలగు విషయాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మరికల్ సిఐ రాజేందర్, ఎస్సై కురుమయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## దేవరకద్రలో ఘనంగా వాసవిమాత పల్లకిసేవ..

**- అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు**

**దేవరకద్ర,జూలై 28 ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పల్లకిలో తీసుకొని దేవస్థానం చుట్టూ ప్రదిక్షణలు నిర్వహించారు. పురోహితుల వేదమంత్రాలు,భక్తులు హరినామశ్చరణల మధ్య ఈ సేవ ముందుకు కదిలింది. అనంతరం అమ్మవారి సన్నిధిలో అర్చకుడు హరిశంకరశర్మ అధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవిమాత అమ్మవారు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం అధ్వర్యంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

**ఘనంగా కుంకుమార్చన..** దేవస్థానంలో శ్రీ చక్రాలతో అమ్మవారికి కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అలితా సహస్రనామపారాయణం కార్యక్రమాన్ని కూడ నిర్వహించారు. పంచామతాలతో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజ నిర్వహించారు. మహామంగళహారతి,ప్రసాదవితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షుడు కల్వకన్నయ్యశెట్టి,మహిళాసంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజులరాణీలతో పాటు స్థానిక ఆర్యవైశ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



వాసవిమాతకు పూజలు చేస్తున్న భక్తులు

## తెలంగాణ ఏర్పాటులో జైపాల్‌రెడ్డిది కీలకపాత్ర..

**- డీసీసీ అధ్యక్షుడు జి మధుసూదన్‌రెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 28, ప్రభాతవార్త :** తెలంగాణ ఏర్పాటులో కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డిది కీలకపాత్ర అని కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు జి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దివంగత సూదిని జైపాల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను కొనియాడారు. తెలంగాణ ఏర్పాటులో సోనియా గాంధీని ఒప్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. తెలంగాణ బాగుకోసం ఆలోచించిన వ్యక్తి అన్నారు. పెట్రోలియం శాఖ మంత్రిగా ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తుచేశారు. గొప్ప రాజకీయ విలువలు కలిగిన వ్యక్తిగా పేరు తెచ్చుకున్నాడని నేడుపార్టీలకు అతీతంగా ఆయన వర్ధంతిని నిర్వహించడం ఆయన తెచ్చుకున్న పేరుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి బెనహర్, పట్టణాధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, జిల్లా జనరల్ సెక్రెటరీ సిరాజ్‌ఖాద్రి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఫయాజ్, పట్టణ దళిత కాంగ్రెస్ అధ్యక్షుడు నాగరాజు, హన్వాడ మండలాధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు సిరాజుద్దీన్, అనిల్‌రెడ్డి,మురళి, చంద్రమౌళి, ఫక్రు, అలీ,వెం కటేశ్,రామచంద్రయ్య, శంకరయ్య, లక్ష్మణ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



జైపాల్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మధుసూదన్‌రెడ్డి, నాయకులు

## 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలి..

**- సీఐటీయు జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు - 23వ రోజు కొనసాగుతున్న గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె**

**వనపర్తిటౌన్,జూలై28,ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ కార్మికులతో గ్రామాలలో 12 గంటల పని చేయిస్తున్నారని, కార్మిక చట్టం ప్రకారం 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం గోపాల్‌పేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు ఆయన హాజరై ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ... ఏడాదికి రెండు జతల యూనిఫామ్స్ ప్రతి సంవత్సరం ఇవ్వాల్సి ఉండగా గోపాల్‌పేట, ఏదుట్ల గ్రామాలలో తప్పా మిగతా అన్ని గ్రామాలలో కేవలం ఒక జత మాత్రమే ఇవ్వడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. సబ్బులు నూనెలు ప్రతి నెల ఇవ్వాల్సి ఉండగా ఏదో ఉత్సవాల సందర్భంగా మాత్రమే ఇస్తున్నారని, మిగతా సందర్భాల్లో ఇవ్వడం లేదని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒక అగ్రిమెంట్ పత్రాన్ని తయారు చేసి 11 నెలలకే మల్టీపర్పస్ వర్కర్ పద్ధతి మీకు ఉంటుందని మీరు ఎప్పుడైనా మేము చెప్పినట్టు వినకపోతే తొలగించే అధికారం మాకు ఉంటుందని పొలికెపహాడ్ కార్యదర్శి సంతకాలు చేయమని అడగడం అన్యాయమని దీనిని వెంటనే ఈ పంచాయతీ కార్యదర్శికి హెచ్చరిక చేయాలని వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వం జేఏసీతో చర్చలు జరిపి న్యాయమైన కోరికలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల నాయకులు యాపచెట్టు సుధాకర్ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏదుట్ల కురుమయ్య, గోపాలపేట కుకరుమయ్య, మండల అధ్యక్షులు నాయకులు నరేష్, రాజు, చెన్నమ్మ, దర్గమ్మ కవిత తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

## వీపనగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రివ్యూ మీటింగ్

**- ఆగస్టు 7న మిషన్ ఇంద్రధనుస్సు కార్యక్రమం : డాక్టర్ వంశీకృష్ణ**

**వీపనగండ్ల,జూలై28,ప్రభాతవార్త:**మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం మండల వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సిబ్బందికి ఆశా వర్కర్లకు వారికి కేటాయించిన టార్గెట్, వర్షాలు పడుతున్నందున ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించాలని, అదే విధంగా ఆగస్టు 7న నిర్వహించే ఇంద్ర ధనుసు కార్యక్రమం రెండు సంవత్సరాలలోపు, రెండు నుండి ఐదు సంవత్సరాలలోపు గర్భావతి స్త్రీలకు ఎవరైనా టీకాలు వేయించుకోకపోతే వారిని గుర్తించి టీకాలు వేయాలని తెలిపారు.ఈఇంద్రధనుసు కార్యక్రమం ఆగస్టు 7వ తేదీ నుండి 12వ తేదీ వరకు నిర్వహించుకోవాలని తెలిపారు.ఈకార్యక్రమంలో వైద్యులు,సూపర్‌వైజర్లు ఏఎన్ఎం,సిబ్బంది,ఆశావర్కర్లు,ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

**రోడ్డు ప్రమాదానికి గురైన తిప్పన్నను**

## పరామర్శించిన ఎమ్మెల్యే సతీమణి జ్యోతి

**ధరూర్, జూలై 28 ప్రభాతవార్త :** మండల పరిధిలోని బూరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తిప్పన్నను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సతీమణి, సర్పంచ్ జ్యోతి పరామర్శించారు. తిప్పన్న ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఆమె వెంట బిఆర్ఎస్ పార్టీ నాయకులు,మహిళా నాయకురాలు రాధా మధుమతి పాల్గొన్నారు.



**జమ్ములమ్మ అమ్మవారిని**

## దర్శించుకున్న జమ్మిచేడు ఈఓ పురందర్‌కుమార్

**మల్దకల్,జూలై 28 ప్రభాతవార్త :** ఆదిశిలాక్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూలక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని శుక్రవారం జమ్మిచేడు శ్రీ జమ్ములమ్మ పరశురామ స్వామి దేవస్థానం ఈఓ పురందర్‌కుమార్ సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ జమ్ములమ్మ దేవాలయ ఈఓగా బాధ్యతలు తీసుకుంటున్నందున ముందుగా మల్దకల్ దేవాలయన్ని సందర్శించుకుని పూజలు నిర్వహించగా ఆయనకు దేవాలయ చైర్మన్ ప్రహ్లాదరావు అర్చకులు శేష వస్త్రంతో ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



## సీఐ సోమనర్సయ్యకు ఘన సన్మానం...



**వెల్దండ,జూలై28 ప్రభాతవార్త:**ఇటీవల వెల్దండ పోలీస్ సర్కిల్ వలయాధికారిగా బాధ్యతలు చేపట్టిన సోమ నర్సయ్యను బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షులు జంగిలి యాదగిరి ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అదే విధంగా ఎస్ఐ శ్రీనివాస్‌ను శాలువాలతో సన్మానించారు. సర్పంచ్ అంజయ్య, నాయకులు జంగిలి ప్రసాద్,భీమరాజు,చందు, వెంకట్, లింగం, వంశీ, వెంకటయ్య, చంద్రయ్య, రవికుమార్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు

**వెల్దండ, జూలై 28 ప్రభాతవార్త:**టవేరా-ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న భార్యభర్తలు తీవ్రంగా గాయపడిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... ఉప్పునుంతల మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కొమ్ము శ్రీను-శైలజలు భార్యభర్తలు, గురువారం హైదరాబాద్‌కు తమ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా రాఘాయిపల్లి గ్రామ స్టేజీ వద్ద బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో భార్యభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం రోడ్డు ప్రమాద ఘటనపై శైలజ ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

## మైనార్టీ రుణాలకు ఇంటర్వ్యూలు..

**వెల్దండ, జూలై 28 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మైనార్టీ రుణాల కోసం ధరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఎంపీడీఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 3యూనిట్లకై 70మంది లబ్దిదారులు మైనార్టీ రుణాల కోసం ధరఖాస్తు చేసుకోగా 52 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. బ్యాంక్ మేనేజర్లు, ఫీల్డ్ అధికారులు ఉన్నారు.



## అంత్యక్రియలకు ఆర్థికసాయం

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 28, ప్రభాతవార్త :** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు శివాజినగర్‌లో అరుణ అనే మహిళ మరణించారు.విష యాన్ని కౌన్సిలర్ మున్సిపల్ చైర్‌పర్సన్ దోరెపల్లి లక్ష్మీరవీందర్‌కు తెలుపగా ఆమె వార్డుకు చేరుకొని అరుణ పార్థీవదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చరు. ఎమ్మెల్యే సహకారంతో రూ.5వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.కార్యక్రమంలో కౌన్సిలర్‌చైతన్య హరికృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ ప్రదీప్, నాయకులు బాదం మహేశ్, నరేశ్,హబీబ్ పాల్గొన్నారు.



## జలసవ్వడి..

**మొదటిపేజీ తరువాయి భాగం...**

వరదను గురువారం పరిశీలించి వాగు దాటకుండా ప్రజలకు సూచనలు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలో దుందుభి ఉధృతంగా ప్రవహిస్తున్నది. రఘుపేట వద్ద, కల్వకుర్తి నుంచి తెలకపల్లి మధ్య, సిర్సవాడ వాగు పెద్ద ఎత్తున ప్రవహిస్తుండంతో వాగు దాటొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## కేజీ విల్స్ ట్రాక్టర్లు రోడ్లపై నడపరాదు



ట్రాక్టర్ యజమానులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ మాధవరెడ్డి

**అడ్డాకుల, జూలై28, ప్రభాతవార్త:** అడ్డాకుల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ట్రాక్టరన యజమానులకు విజ్ఞప్తి కేజీవిల్స్ ట్రాక్టర్లు గ్రామాలలో రోడ్లపై ప్రయాణించడం వల్ల రోడ్లు ధ్వంసం చేయడం నేరం కావునా ట్రాక్టర్ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. అడ్డాకుల మండలంలోని వివిధ గ్రామాల సర్పంచు లకు విజ్ఞప్తి చేశారు. గ్రామాలలో ఎవరు కూడా కెజివిల్స్ ట్రాక్టర్లు రోడ్లపై నడపరాదని వివిధ గ్రామాల సర్పంచులు గ్రామంలో డప్పుతో సాటింపు వేయించాలని ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు.

## ప్రశాంతంగా మొహరం వేడుకలు జరుపుకోవాలి



ఎస్సై బాలరాజు

**ఉండవల్లి, జూలై 28 ప్రభాతవార్త:** ప్రశాంతంగా నేడు మొహరం ఉత్సవాలను ప్రజలంతా కలిసి మెలిసి భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని మండల ఎస్సై బాల రాజు తెలిపారు. హిందూ, ముస్లిం మత పెద్దలకూ శుక్రవారం పండుగ లాంటిదని అన్నారు. ఈ సందర్భంగా ఎస్సై బాలరాజు మాట్లాడుతూ మొహరం పండగను ప్రజలంతా కుల మతాలకతీతంగా ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవాలని, ప్రతి ఒక్కరు పరమత సహనం పాటిస్తూ పోలీసులకు సహకరించాలని సూచించారు. మొహరం వేడుకలు అన్ని గ్రామాలలో నిర్వహించే అన్ని గ్రామాల ప్రజలు మొహరం వేడుకలు ప్రశాంతంగా జరుపు కోవాలని సూచిం చారు. గ్రామంలో శాంతి భద్రతలు కాపాడే బాధ్యత మాపైన ఉందని ఎటువంటి అల్లర్లు కాకుండా జరుపుకోవాలని ఎవరైనా ఆకతాయిలు కూడా అల్లర్లు చేస్తే వెంటనే సంప్ర దించాలని లేని ఎడల వెంటనే 100కు డయల్ చేయాలని అన్నారు.

## జిల్లా కాంగ్రెస్ కమిటీలో మండల నాయకులకు చోటు



నియామక పత్రాలు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**ఇటిక్యాల, జులై 28 ప్రభాతవార్త:** జిల్లా కాంగ్రెస్ కమిటీలో పలువురు మండల నాయకులకు ఏఐసిసి కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి నేతృత్వంలో చోటు కల్పించారు. ఈ సందర్భంగా వారికి నియామక పత్రాలను అందజేశారు. జిల్లా కాంగ్రెస్ కమిటీలో కార్యవర్గ సభ్యులుగా పెద్దదిన్నె గ్రామానికి చెందిన సోమిరెడ్డి, మెడికల్ మద్దిలేటి, ఇటిక్యాల మండల కేంద్రంలో రామచంద్రారెడ్డి, నక్కలపల్లి జైపాల్‌రెడ్డి, పుటాన్‌దొడ్డి మంద జగన్నాథం, రాజ్ కుమార్ తదితరులకు జిల్లా కాంగ్రెస్ కమిటీలో పదవులు లభించాయి. ఈ సందర్భంగా జిల్లాకాంగ్రెస్ కమిటీలో పదవులు పొందిన వారు వచ్చే ఎన్నికల్లో పార్టీ బలోపేతం కోసం పనిచేయాలని వారిని సూచించారు.

## సబ్ కలెక్టర్‌గా పదోన్నత పొందిన ఇటిక్యాల తహసీల్దార్ సుబ్రమణ్యం

■ అభినందనలు తెలిపిన మండల ప్రజా ప్రతినిధులు



సబ్ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న ఎంపిపి

**ఇటిక్యాల, జులై 28 ప్రభాతవార్త:** మండల తహసిల్దార్‌గా పని చేస్తున్న డి. సుబ్రహ్మణ్యంకు ప్రభుత్వం సబ్ కలెక్టర్‌గా పదోన్నతి కల్పించింది. తెలంగాణ ప్రభుత్వం తహసిల్దార్‌లను సీనియార్టీ ప్రకారం 81 మందిని సబ్ కలెక్టర్‌లుగా పదోన్నతి కల్పిస్తూ గురువారం జిఓ జారీ చేసింది. ప్రభుత్వం జిఓ జారీ చేసిన జాబితాలో సీరియల్ నంబర్ 24 లో ఇటిక్యాల తహసిల్దార్‌గా పని చేస్తున్న డి. సుబ్రహ్మణ్యం సబ్ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన వారిలో ఉన్నారు. ఈయన 2007వ బ్యాచ్‌కు చెందిన మొదటగా డిప్యూటి తహసిల్దార్‌లుగా విధుల్లో చేరి ట్రైనింగ్ అనంతరం 2008 నుండి 2011 వరకు మెదక్ జిల్లాతుల్చారం మండల తహసిల్దార్‌గాపని చేస్తూ బదిలీపై జోగులాంబ జిల్లాలోని మానవపాడు మండల తహసిల్దార్‌గా పని చేశారు. అప్పటి నుండిఇప్పటివరకు జోగులాంబ జిల్లాలోని అయిజ, గద్వాల, గట్టు, ఇటిక్యాల మండలాలలో తహసిల్దార్‌గా పని చేస్తూ వచ్చారు. పని చేసిన ప్రాంతాలలో ప్రభుత్వనిబంధనల ప్రకారంపేద ప్రజలసమస్యల పరిష్కారానికై కృషి చేశారు. ఆయామండలాలలో పని చేసిన చోట అందరి మన్ననలు పొందారు.

**పదోన్నతి పొందిన సుబ్రహ్మణ్యంకు అభినందనల వెల్లువ..**

ఇటిక్యాల మండలంలో తహసిల్దార్‌గా రెండున్నర సంవత్సరాలుగా పని చేస్తున్న డి.సుబ్రహ్మణ్యంకు తెలంగాణ ప్రభుత్వం గురువారం సబ్ కలెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ జీఓ జారీ చేయడంతో శుక్రవారం మండల ప్రజా ప్రతినిధులు, ఎంపిపి స్నేహశ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి శేషన్‌గౌడ్, నాయకులు సుధాకర్‌రెడ్డి, చంద్రగౌడ్, నడిపన్న, వేణుగోపాల్ నాయుడు కార్యాలయంలో పని చేస్తున్న విఆర్‌ఎలు, శివ, మహేష్, నరసింహ, బీసన్న తదితరులు పదోన్నతి పొందిన సుబ్రహ్మణ్యంను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

## కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన ఉదండాపురం ప్రజలు



**ఇటిక్యాల, జులై28 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఉదండాపురం గ్రామానికి చెందిన సర్పంచ్ అయ్యమ్మ, దానం గ్రామస్తులతో కలిసి శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతిని కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. 18 సంవత్సరాల క్రితం నిరుపేద లకు ఇంటి స్థలాలను ఇచ్చేందుకు గత ప్రభుత్వం భూమిని కొనుగోలు చేయ గా ఇంటి స్థలాలు పట్టాలు పంపిణీ చేయకుండా ఇప్పటి వరకు ఆగిపోవడం తో తెలంగాణ రాష్ట్ర దశాబ్ద ఉత్సవాలలో భాగంగా ప్రభుత్వం ఆ భూమిలో ఇంటి స్థలాలను పంపిణ చేయాలని ఆదేశించగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఇటిక్యాల తహసిల్దార్ సుబ్రహ్మణ్యం ఆధ్వ ర్యంలో ప్రజల నుండిదరఖాస్తులు తీసుకొని విచారించి అర్హులైన వారికి గ్రామంలో 127 మందికి ఇంటి స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. 18 ఏళ్ల సమస్య ఇంటి స్థలాల పట్టాలను పంపిణీ చేసినందుకు కృతజ్ఞతగా కలెక్టర్‌ను సన్మానించారు. అదేవిధంగా మండల తహసిల్దార్ సుబ్రహ్మణ్యంను సర్పంచ్ అయ్యమ్మ, దానం గ్రామస్తులు బుచ్చన్న, రాజు, దైవన్న, గజేంద్ర, సురేష్ తదితరులు సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

# మేరీ మట్టి మేరా దేశ్‌పై అవగాహన



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ కుమార్ దీపక్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై28 ప్రభాత వార్త:** స్వాతంత్ర్య అమృత్ మహోత్సవం ముగింపు కార్యక్రమాల్లో భాగంగా ఆగస్టు 9 నుంచి 30 భారత దేశ వ్యాప్తంగా మేరీ మట్టి మేరా దేశ్ ప్రచారం ఘనంగా నిర్వ హించాలని కేంద్ర హోంశాఖ కార్యదర్శి విజయ్ తివారీ సూచించారు. శుక్రవారం న్యూ ఢిల్లీ హోంశాఖ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, కలెక్టర్లు, డీఆర్‌డీఓలు, డీ.పీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమ నిర్వ హణపై పలు సూచనలు చేశారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ఎందరో మహానుభావులు దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలు త్యాగం చేశారని, అదే విధంగా స్వాతంత్ర్యానంతరం దేశ రక్షణ కోసం ఎందరో జవాన్లు అమరవీరుల య్యారు. అమరవీరులు, స్వాతంత్ర్య సమరయో ధుల స్మారకార్థం దేశంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో అన్ని మున్సి పాలిటిల్లో ఆగస్టు 9 నుంచి 30వరకు మేరీ మట్టి మేరా దేశ్ ప్రచారం నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మేరీ మట్టి మేరా దేశ్క్యాం పెయిన్ క్రింద నిర్వహించే కార్యక్రమాల్లో లక్షలాది మంది స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరులు, వీరుల పేర్లతో కూడిన శిలఫలకాలు ఏర్పాటు చేసి వారి కుటుంబాలను సత్కరించాలని సూచించారు. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటి స్థాయి కార్యక్రమాలు ఆగస్టు9 నుంచి ఆగస్టు15 వరకు నిర్వహిస్తా న్నారు. ఇందులో ప్రతి గ్రామంలో వీరుల బ్యానర్లు రూపొందించి నివాళులర్పించాలి, అక్కడే యువతకు తమ చేతిలో మట్టి పట్టుకొని రూపొందించిన పంచప్రాణ శపథం చేయాలి. సెల్ఫీలు దిగి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ ప్రచారం క్రింద వసుధ వందనంలో 75 మొక్కలు నాటాలని సూచించారు. దీంతో పాటు గత సంవత్సరం మాదిరిగానే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం క్రింద ఆగస్టు 13 నుంచి 15వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి ప్రతి గ్రామం నుంచి తీసిన మట్టి కలశాలను రాజ ధాని ఢిల్లీకి పంపించాలి. అనంతరం ప్రధాన కార్యక్రమం 2023 ఆగస్టు 27 నుంచి30 మధ్య న్యూఢిల్లీలో జరుగుతుందని తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా నుంచి అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, యువజన సర్వీ సుల శాఖ అధికారి సీతారాం, ఇన్‌ఐసీ సిబ్బంది పాల్గొన్నారు.

# కిసాన్ కేంద్రాల వద్ద బీజేపీ అవగాహన కార్యక్రమాలు



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, జూలై 28 ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్రమోడీచే ప్రవేశ పెట్టిన కిసాన్ సమృద్ధి కేంద్రాలను కల్వకుర్తి పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు నర్సింహ్మ ఆధ్వర్యంలో వెంకటేశ్వర ఫర్టిలైజర్ ముందు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు దుంప్రసాద్ మాట్లాడుతూ కిసాన్ సమృద్ధి కేంద్రాల ద్వారా రైతులకు వ్యవసాయానికి అవసరమయ్యే పనిముట్లు, ఎరువులు, విత్తనాలు, భూసార పరీక్షలు, అన్ని రకాల సమాచారాన్ని అందుబాటులో ఉండే విధంగా రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేయడమైందని, యూరియా 2236, డీఏపీ 1350 పెద్ద మొత్తంలో సబ్సిడీని కేంద్రప్రభుత్వంభరిస్తుందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు అవసరమయ్యే యూరియా, ఎరువులను బ్లాక్ మార్కెట్‌లో ఉంచిదళారి వ్యవస్థను ప్రవేశ పెట్టి రైతాంగాన్ని నట్టేట ముంచి రైతులు ఆత్మహత్యలు చేసుకునేలా దౌర్భాగ్య పరిస్థితిని కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిందని ఆయన విమర్శించారు. బీజేపీ ప్రభుత్వంలో రైతులను రాజును చేయాలనే సదుద్దేశ్యంతో ప్రధాని మోడీ ఫసల్ భీమా యోజన పథకాన్ని ప్రవేశ పెట్టి పంటనష్ట పరిహారంతో పాటు రైతులకు సంవత్సరానికి ఎకరాకు రూ.6వేల పెట్టుబడి సహాయం ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాఘవేందర్‌గౌడ్, వివేకానంద్, రవి గౌడ్, శ్రీధర్, నరేష్‌గౌడ్, సూర్యనారాయణ, లక్ష్మీనరసింహ, సాయి, వంశీ గౌడ్, అంజి, వెంకటేశ్వర ఫర్టిలైజర్ యజమాని గోపిరెడ్డి రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

# మక్తల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో ఎమ్మెల్యే విఫలం

- పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజు గౌడ్

**అమరచింత, జూలై28, ప్రభాతవార్త:** మక్తల్ నియోజకవర్గం అభివృద్ధి చేయడంలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పూర్తిగా వైఫల్యం చెందారని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజు గౌడ్ ఆరోపించారు. శుక్రవారం ఆత్మకూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమస్యలపై ఆయన మాట్లాడుతూ... మక్తల్ నియోజకవర్గం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి 9 సం.లు ఎమ్మెల్యేగా ఉంటూ ఏ మండలానికి వెళ్లిన అభివృద్ధి కనబడడం లేదని మక్తల్ నియోజకవర్గాన్ని పూర్తిగా వెనుకబాటుకు గురి చేశారని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే పేరుగాంచిన జూరాల ప్రాజెక్టు రోడ్డు లేక ప్రజలు సందర్శకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని నాలుగుసార్లు టెండర్లు వేసిన రోడ్డు వేయకుకండా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అలాగే ఆత్మకూరు నుండి మూలమల్ల మీదగా జూరాల ప్రాజెక్టు వరకు రోడ్డు మంజూరైన పనులు కావడం లేదని అధికార పార్టీకి చెందినవారు పర్సంటేజ్‌ల కోసం రోడ్డు పనులు సాగడం లేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హాయాంలోనే నియోజకవర్గంలో అభివృద్ధి చెందిందని మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఏమీ అభివృద్ధి చేశారని మళ్లీ ప్రజల ముందుకు వస్తే ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని ఆయన ప్రజలను కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రెండులక్షల రుణమాఫీ చేస్తామని మహిళలకు రూ.500 కే గ్యాస్ సిలిండర్ అందిస్తామని, నిరుద్యోగులకు జీవన భృతి కల్పిస్తామని రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఆయన చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు కాంగ్రెస్ పార్టీ విజయానికి పైనికుల పని చేసే మక్తల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండాను ఎగరవేయాలని ఆయన కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జిల్లా కార్యదర్శి ఐయూఫ్‌ఖాన్, మొగిలి గంగాధర్‌గౌడ్, పరమేశ్వర్, కేజీ మహేందర్‌రెడ్డి, అరుణ్ కుమార్, శ్యామ్, చికెన్ వెంకటన్న, పోషిరిగారి విష్ణు, హనుమంత్ నాయక్, మధు తదితరులు పాల్గొన్నారు.

# దళిత బంధు పథకం దేశానికి ఆదర్శం

● దళితుల జీవితంలో వెలుగులు నింపిన నాయకుడు సిఎం కెసిఆర్ : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగి రెడ్డి నిరంజన్‌రెడ్డి



కోళ్ల ఫారం ప్రారంభిస్తున్న మంత్రి

**కెటిదొడ్డి, జులై 28 ప్రభాతవార్త:** గద్వాల నియోజకవర్గంలో కెటిదొడ్డి మండల పరిధిలోని ఇర్కిచేడు గ్రామానికి చెందిన గంగమ్మ తిప్పయ్యకి దళితబంధు లబ్దిదారులకు ఎంపికైన రూ. 10లక్షల వ్యయంతో అక్షయ కోళ్ల ఫారం మంజూరు కావడం జరిగింది. యూనిట్ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహాం చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మంత్రికి ఎమ్మెల్యేలు లబ్దిదారులు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. మంత్రి మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు చేయలేని విధంగా నేడు తెలంగాణ రాష్ట్రంలో సీఎం కెసిఆర్ దళితుల కోసం దళితబంధు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ప్రపంచంలో ఏ ప్రధాన మంత్రికి ఏ ముఖ్యమంత్రికి రాని ఆలోచన రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్‌కు వచ్చిందన్నారు. దళిత బంధు పథకానికి శ్రీకారం చుట్టి దళితులు ఆర్థికంగా ఎదిగేలా దళితులు కూడా నలుగురికి ఉపాధి కల్పించే విధంగా ఉండాలని దళితులు గతంలో ఓట్లు వేసే యంత్రాలుగా ఉపయోగించుకున్నారు తప్ప వారికి ఏ మాత్రం కూడా ఇలాంటి ఆర్థిక పథకాలను ప్రయోజనాలను గాని చేపట్టలేదని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపిలు మనోరమ, విజయ్, జడ్పీటిసి రాజశేఖర్, వైస్ ఎంపిపి రామకృష్ణ నాయుడు, పిఎసిఎస్ ఛైర్మన్ తిమ్మారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఉరుకుంద, రైతుబంధు సమితి అధ్యక్షుడు హనుమంతు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసి, సింగిల్ విండో డైరెక్టర్లు, బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ రంగ సంస్థల అభివృద్ధికి కృషి చేయాలి

● ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించేందుకు కృషి
● రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగి రెడ్డి నిరంజన్‌రెడ్డి
● విజయ వంట నూనెల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి



విజయ వంట నూనెల విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి టౌన్, జూలై28, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలో ఆయిల్ ఫెడ్ సంస్థ వారి విజయ వంట నూనెల విక్రయ కేంద్రాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రస్తుత కాలంలో మనం తీసుకునే ఆహారం ఏదో రకంగా కల్తీ జరుగుతుందన్నారు. జిల్లా ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలనే ఉద్దేశ్యంతో ఆయిల్ ఫెడ్ ఛైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి విజయ వంట నూనెల రిటైల్ అవుట్‌లెట్ నిర్మించడానికి స్థలం కావాలని అడగగా వెంటనే పట్టణ కేంద్రంలో స్థలాన్ని కేటాయించడం జరిగిందని తెలిపారు. మన వనపర్తి పట్టణంలో ప్రభుత్వ రంగ సంస్థ ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ప్రజలు ప్రభుత్వరంగ సంస్థ విజయ వంట నూనెలు, వంట సరుకులు మాత్రమే వాడి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తద్వారా సూచించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుంటే భవిష్యత్తులో ప్రైవేటు సంస్థల అరాచకాలకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. ఈ సందర్భంగా ఆయిల్ ఫెడ్ ఛైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ... రిటైల్ ఔట్‌లెట్‌ల కోసం స్థలం అడగగానే కేటాయించిన మంత్రి , మున్సిపల్ ఛైర్మన్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ రోజు మంత్రి చేతుల మీదుగా రిటైల్ అవుట్ లెట్ ప్రారంభించుకోవడం శుభ పరిణామం అని, పట్టణ ప్రాంత ప్రజలే కాకుండా చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు కూడా కల్తీ లేని విజయ వంట నూనెలు, వంట సరుకులను మాత్రమే వాడాలన్నారు. వంట నూనెలతో పాటు శుద్ధమైన కిన్నెర తాగునీరు కూడా రిటైల్ అవుట్‌లెట్‌లో అందుబాటులో ఉంటుందన్నారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని రిటైల్ ఔట్‌లెట్‌లను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ ఎండి సురేందర్, జడ్పీ ఛైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ గట్టు యాదవ్, జనరల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ తిరుమలేష్ రెడ్డి, మేనేజర్ సత్యనారాయణ, మున్సిపల్ కౌన్సిలర్స్, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.





## హస్తం గూటికి బీఆర్ఎస్ నాయకులు



వంశీకృష్ణ సమక్షంలో పార్టీలో చేరుతున్న నాయకులు

**అచ్చంపేట, జూలై 28 ప్రభాతవార్త:** లింగాల మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి డీసీసీ జిల్లా అధ్యక్షులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సమక్షంలో హస్తం గూటికి చేరారు. ఎమ్మెల్యే గువ్వల బాలరాజు వ్యవహారశైలి నచ్చకపోవడంతో గత మూడు రోజుల క్రితం పత్రిక సమావేశం నిర్వహించి అచ్చంపేట నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని, మరింత అభివృద్ధి చేస్తామని మోసపూరిత హామీలు, మాటలు చెప్పడమే తప్ప నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేపట్టలేదని పార్టీలో చేరిన నాయకులు విమర్శించారు. ఎమ్మెల్యే మాయ మాటలు నమ్మి తెలంగాణ ఉద్యమంలో స్వరాష్ట్రమే ధ్యేయంగా ఉద్యమ సిద్ధాంతంతో గెలిపించుకుంటే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించకుండా అచ్చంపేటను ఆగం చేశారని, రానున్న ఎన్నికల్లో గువ్వల బాలరాజుకు గుణపాఠం చెప్పి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ గెలుపుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎల్లయ్య, చిన్న రాములు, పెద్ద రాము, పరుశరాం, మల్లేష్, బాలకృష్ణ, నాగయ్య తదితరులు ఉన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

**కల్వకుర్తి, జూలై 28 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని కళ్యాణ్‌నగర్‌కు చెందిన మాద్గుల బాల్‌రాం అనే వ్యక్తి కొద్ది రోజుల క్రితం తాండ్ర గేటు దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాల్‌రాం మృతితో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాన్ని పరామర్శించి వారి పిల్లల చదువుల కోసం రూ.5వేల ఆర్థిక సహాయాన్ని మిత్ర ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

## జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి

**ఉప్పునుంతల, జులై 28 ప్రభాతవార్త:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు కలిగిన ప్రతి ఉపాధి కూలీకి పనులు కల్పిస్తామని ఎంపిడిఓ లక్ష్మణ్‌రావు ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. శుక్రవారం మండలంలోని వెల్టూరు, లత్తిపూర్ గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. శ్రీశైలం, హైదరాబాద్ ప్రధాన రహదారిపై మొక్కలు నాటేందుకు గోతులు తీయడం, తీసిన గోతులలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎంపిడిఓ పరిశీలించారు. ఎంపిడిఓ లక్ష్మణ్‌రావుతో పాటు ఎపిఓ సుదర్శన్‌గౌడ్, సర్పంచ్ మల్లేష్, ఇజిఎస్ టెక్నికల్ అసిస్టెంట్ సింగోటం, ఫీల్డ్ అసిస్టెంట్లు దేవేందర్, రాము పాల్గొన్నారు.

## రోగులకు పండ్లు పంపిణీ



ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న వైద్యులు

**ఉప్పునుంతల, జులై 28 ప్రభాతవార్త:** నల్లమల వాసి స్వర్గీయ డా. మంద జంగిరెడ్డి వర్థంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఆయన తనయుడు మంద శ్రీనివాస్‌రెడ్డి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆయనతో పాటు స్థానిక వైద్యాధికారిణిడా. స్వప్న, ఫార్మాసిస్టుశ్రీనివాసులు, వైద్యసిబ్బంది, ఖాజా ఉన్నారు.

## పరవళ్లు తొక్కుతున్న దుందుభి



ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభి వాగు

**ఉప్పునుంతల, జులై28 ప్రభాతవార్త:** ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు దుందుభి వాగు పరవళ్లు తొక్కుతుంది. శుక్రవారం ఉదయం మొల్గర కాజ్‌వే వద్ద భారీగా నీరు డిండి చెరువులో పారుతుంది. ఎగువ ప్రాంతంలో నుంచి నీరు రావడంతో మొల్గర కాజ్‌వే వద్ద ఉరకలేస్తుంది. దీంతో అక్రమ రవాణాకు చెక్ పడిపట్లేనా అని మండల ప్రజల్లో ప్రశ్నార్థకంగా ఉంది. దుందుభి వాగు మాఫియా దేవాలయాలు, సిసి రోడ్ల నిర్మాణం కోసం అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి అనుమతుల పేరిట దుందుభిని లూటీ చేశారు. దుందుభి వాగు ప్రవహిస్తే మాఫియా, ఇసుక వ్యాపారులకు కొంతమేరకు విశ్రాంతి తీసుకునే అవకాశం వచ్చినట్లయింది. ఏకంగా దుందుభి వాగును తోడేయడానికి అధికారుల సహకారం, ప్రజా ప్రతినిధుల అండదండలతో దుందుభిపై దందా చేశారు. ఇప్పటికైనా చెక్ పెడతారా ఇసుక మాఫియాను పెంపొందిస్తారా వేచి చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## పెద్దపీర్ల చావిడికి పోటెత్తిన భక్తులు



**ఉట్కూర్, జులై 28 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ప్రతి సంవత్సరం ఘనంగా జరుపుకుంటున్న పీర్ల పండగ ఆనవాయితీలో భాగంగా శుక్ర వారం రాత్రి సవారి ఉంటుందని పీర్లు ఊరంతా తిరుగుతాయి. అలాగే భక్తులు బెల్లం పిండితో చేసిన మాల్జాను దేవు నికి నైవేద్యంగా ఇస్తారు. కొతమంది భక్తులు గొర్రెలు, మేకలతో రోషన్ తాత దగ్గర మొక్కులు తీర్చుకుంటారు. భక్తులు అసన్, హుస్సేన్‌కి దోస్తా దీనంటూ నినాదాలతో సవారిని నిర్వహిస్తారు. మిఠాయి దుకాణాలు, రంగులరాట్నం, వివిధ ఆట బొమ్మలు, పెద్ద ఎత్తున భక్తులతో జాతర జరుగుతుంది. భక్తుల కోరికలు నెరవేరుతాయని వివిధ పట్టణాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సర్పంచ్ సూర్య ప్రకాశ్‌రెడ్డి రోడ్డుపై నీటి గుంతలను మోరం వేయించామని తెలిపారు.

## చేప విత్తనాల లభ్యత పరిశీలన

- చేప విత్తనాల కేంద్రంను సందర్శించిన ఎడి ఫిషరీష్ రహమాన్

**వనపర్తి టౌన్, జూలై28, ప్రభాతవార్త:** ప్రభుత్వ నిబంధనల మేరకు చేప విత్తనాల సైజు ఉండాలని అదనపు కలెక్టర్ తిరుపతి రావు అన్నారు. శుక్రవారం ఎడి ఫషరీష్ రహమాన్‌తో కలిసి ఆత్మకూరు మండలంలోని చేప విత్తనాల కేంద్రంను సందర్శించి చేప విత్తనాల లభ్యతను పరిశీలించారు. శివ ఫిఫ్ సీడ్ ఫార్మ్, రాజేందర్ సీడ్ ఫార్మ్‌ను పరిశీలించిన అదనపు కలెక్టర్ త్వరలో జిల్లాలోని చెరువులు, రిజర్వాయర్‌లలో చేప విత్తనాలు వదలడం జరుగుతుందని అందుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం సైజులు, మేలు రకం విత్తనాలు ఉండాలని సూచించారు. ఎడి ఫిషరీష్ రహమాన్, ఇతర బృందసభ్యులుఅదనపు కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ షష్టిపూర్తిలో పాల్గొన్న మున్సిపల్ ఛైర్మన్



**భూత్పూర్, జులై 28 ప్రభాతవార్త:** భూత్పూర్ మున్సిపల్ పరిధిలోని అమిస్తాపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ చెన్నమ్మ యాదయ్య షష్టిపూర్తి మహోత్సవం శుక్రవారం భూత్పూర్ పట్టణ కేంద్రంలోని కెఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ ఛైర్మన్ సత్తూరు బస్వరాజ్‌గౌడ్ హాజరయ్యారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు అజీజ్, నాయకులు మొహ్మద్‌అహ్మద్, షేక్ యాసిన్‌పాషా, సత్తూరు సురేష్ గౌడ్, సత్తూరురాకేష్‌గౌడ్, గడ్డంప్రేమ్, సత్తూరు తిరుపతయ్యగౌడ్ పాల్గొన్నారు.

## కార్మికుల సమ్మెకు స్పందించాలి

**23వ రోజు కొనసాగుతున్న గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె**



సహపంక్తి భోజనాలు చేస్తున్న కార్మికులు

**బాలానగర్, జులై 28 ప్రభాతవార్త:** గత 23 రోజులుగా గ్రామ పంచాయతీ కార్మికుల హక్కుల కోసం వారి ఉద్యోగ భద్రత కోసం, ఆరోగ్య భద్రత కోసం, వారి భవిష్యత్తు కోసం చేస్తున్న సమ్మెకు ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఈ మేరకు బాలానగర్ మండల కేంద్రంలో 23వ రోజుకు కూడా తమ సమ్మెను కొనసాగించారు. బాలానగర్ మండల కేంద్రంలో కార్మికులు వంటావార్పు చేసి, సహపంక్తి బోజనాలు చేశారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికుల 17డిమాండ్ నెరవేర్చే వరకు సమ్మెను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ హామీలను ప్రజలకు తెలియపర్చాలి

**మాజీ ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు**



చిక్కుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు

**లింగాల, జులై 28 ప్రభాతవార్త:** గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని, ప్రస్తుతం చేయబోతున్న హామీలను కార్యకర్తలు ప్రజలకు తెలియజేయాలని కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణఅన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్యకర్తలు ఈ నెల30వ తేదీ తరువాత మండలంలోని ప్రతి గ్రామంలోని కార్యకర్తలు ప్రతి గడప గడపకు తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ హామీలను స్టిక్కర్ రూపంలో ప్రతి గడపకు తెలియజేయాలని సూచించారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీలో చేరారు. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మోటార్ సైకిల్ ఢీ : వ్యక్తి మృతి

**భూత్పూర్, జులై 28 ప్రభాతవార్త:** మోటార్ సైకిల్ ఢీకొట్టగా వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం ఉదయం భూత్పూర్ మున్సిపల్ పరిధిలోని అమిస్తాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన కోట్ల శ్రీశైలం (55) అమిస్తాపూర్‌లో రోడ్డు దాటుతుండగా భూత్పూర్ వైపునుంచి మహబూబ్‌నగర్ వైపు వెళ్లే మోటార్ సైకిల్ శ్రీశైలంను ఢీకొట్టడంతో శ్రీశైలం కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడడంతో అతని కుటుంబీకులు, స్థానికులు అతని కుమారుడు మహబూబ్‌నగర్‌లోని ఎస్‌విఎస్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మధ్యాహ్నంమృతి చెందాడని భూత్పూర్ ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. మోటార్ సైకిల్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి వ్యక్తి మృతికి కారణమైన మోటార్ సైకిలిస్టుపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. మృతుడి భార్య కోట్ల యాదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

## జడ్చర్లలో మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేద్దాం

**ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పోగుల రాజేష్ మాదిగ**



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పోగుల రాజేష్ మాదిగ

**కెటిదొడ్డి, జులై 28 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి సభాధ్యక్షులు జంబయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పోగుల రాజేష్ మాదిగ మాట్లాడుతూ జులై 30వ తేదీ జడ్చర్లలో జరిగే మాదిగల విశ్వరూప సన్నాహక సభకు ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాన్యశ్రీ మందకృష్ణమాదిగ హాజరవుతున్న సందర్భంగా అన్ని మండలఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల నాయకులు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. చింతరేవుల ఆంజనేయులు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు అశోక్ మాదిగ, డికె సుందర్‌రాజు, బొజ్జన్న, తిమ్మప్ప, రంజిత్ మాదిగ, రమేష్‌మాదిగ, తాయప్ప, కర్రెప్ప, రాజ, ఉజురప్ప, సురేష్ పాల్గొన్నారు.

## ఘనంగా వాసవిమాత పల్లకిసేవ

**దేవరకద్ర, జులై28 ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారికి అభిషేక కార్యక్రమాన్నినిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ని పల్లకిలో తీసుకొని దేవస్థానం చుట్టూ ప్రదిక్షణలు నిర్వహించారు. పురోహితుల వేధమంత్రాలు, భక్తులు హరినామశ్చరణల మద్య ఈ సేవముందుకు కదిలింది. అనంతరం అమ్మవారి సన్నిధిలో అర్చకుడు హరిశంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తది తర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవిమాత అమ్మ వారు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం అధ్వర్యంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. దేవస్థానంలో శ్రీ చక్రాలతో అమ్మవారికి కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అలితా సహస్రనామపారాయణం కార్యక్రమాన్ని కూడ నిర్వహించారు.

# జూరాలకు భారీగా వరదనీరు



జూరాలకు కొనసాగుతున్న వరద నీటి ప్రవాహం

మండల పరిధిలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి కృష్ణమ్మ పరుగులు పెడుతుంది. మహారాష్ట్ర, కర్ణాటకలో కృష్ణ బేసిక్ పరిధిలో భారీగా వర్షాలు కురుస్తున్న వరద ప్రవాహం మొదలై జలాశయాలలో జలకళ సంతరించుకుంది. రాష్ట్రంలో కృష్ణానది తొలి ప్రాజెక్టు అయిన జూరాలకు వరద మొట్టమొదటిసారిగా 1,20,000 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 9.657 టీఎంసిలు కాగా ప్రస్తుతం 6,569 టీఎంసిల నీరు నిల్వ ఉంది. 22 గేట్ల ద్వారా 83,138 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నెట్టెంపాడు, ఎత్తిపోతల పథకం పంపు ద్వారా 750 క్యూసెక్కుల భీమా లిఫ్ట్‌వన్ ద్వారా 650 క్యూసెక్కుల నీరు ఎత్తిపోస్తున్నారు. ఎడమ కాలువ ద్వారా 390 క్యూసెక్కుల నీటిని క్యూసెక్కులు, పవర్ హౌస్ ద్వారా 37,252 క్యూసెక్కుల నీటిని టోటల్ అవుట్ ఫ్లో 1,22,262 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

ధరూర్, జులై 28 ప్రభాతవార్త

# డెంగ్యూ నివారణకు కృషి చేద్దాం

- రామ్ నగర్ కాలనీలో ఫ్రైడే డ్రై డే నిర్వహణ
- జిల్లా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్ జీ



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**వనపర్తి వైద్య విభాగం, జులై28, ప్రభాతవార్త:** డెంగ్యూ నివారణ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాంనగర్ కాలనీలో ఫ్రైడే డ్రైడే నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్ జి మాట్లాడుతూ... గత కొన్ని రోజుల నుండి వర్షాలు కురుస్తున్నందున నీరు నిల్వ ఉండడంతో దోమలు అధిక సంఖ్యలో వృద్ధి చెంది వివిధ రకాలైన రోగాలను కలగజేస్తుంటాయని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి దోమల ద్వారా డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలుఇండ్లలో ప్రతి రెండు, మూడు రోజులకు ఒకసారి సంపులు, ట్యాంకులు, డ్రమ్ములు కుండలు శుభ్రంగా కడుక్కొని దానిపై దోమలు వాడకుండా మూతలు పెట్టాలని తెలిపారు. ఆశా కార్యకర్తల రికార్డులను పరిశీలిస్తు వారిని నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి జ్వరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పుట్టపాక మహేష్, ఎంసీహెచ్ ఎస్ఎఫ్ నాగమణి, హెల్త్ అసిస్టెంట్లు గంధం రాజు, శ్రీనివాసులు, స్థానిక ఏఎన్ఎం తిరుపతమ్మ, ఆశా కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కృషి వల్లే బాలానగర్, గంగాపూర్ డబుల్ లైన్ రోడ్డు

**బిఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బాలునాయక్**



ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న దృశ్యం

**బాలానగర్, జులై 28 ప్రభాతవార్త:** జడ్చర్ల నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత, ఎమ్మెల్యే డా.లక్ష్మారెడ్డి వల్లే బాలానగర్ నుంచి వయా పెద్ద రేవల్లి గంగాపూర్ వరకు సుమారు 28 కి.మీ. రోడ్డు మంజూరు కావడం జరిగిందని అందుకు 50 కోట్లకు పైగా నిధులు మంజూరు చేయించిన ఘనత ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి దక్కుతుందని బాలానగర్ మండల బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బాలునాయక్ పేర్కొన్నారు. శుక్రవారం ఈ మేరకు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో మర్యాదపూర్వకంగాకలుసుకుని శాలువాపూలమాలలతో ఘనంగా సత్కరించినట్లు తెలిపారు. డబుల్ లైన్ రోడ్డు మంజూరు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రోడ్డు మోకాళ్లలోతు గుంతలతో ఇబ్బందికర పరిస్థితులు ఉండేవని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేలక్ష్మారెడ్డి సహకారంతో ప్రజల కల నెరవేరిందని అన్నారు. అనేక రంగాలలో ప్రజలకు సేవలందిస్తున్న ప్రజా ప్రభుత్వానికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రజలకు ఉందని బాలునాయక్ అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో పార్టీఎస్టీసెల్ ఉపాధ్యక్షులు రమేష్ నాయక్, నాయకులు దేగవత్ రవిందర్ నాయక్, ఎర్రకుంట రవిందర్ నాయక్, పాల్గుమీద తండా గ్రామ అధ్యక్షులు రాజునాయక్, గోవింద్ నాయక్ పాల్గొన్నారు.

# కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డికి ఘన నివాళి

- విద్యార్థులను సన్మానించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్



జైపాల్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై28, ప్రభాతవార్త:** ఉత్తమ పార్లమెంటేరియన్, కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డికి మహబూబ్‌నగర్ మండల పరిదిలోని ధర్మాపూర్ వద్ద జేపీఎన్‌సీఈలో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి కళాశాలకు చేరుకొని జైపాల్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గొప్ప రాజకీయ విలువలు కలిగిన నేత అని మంత్రి కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, జేపీఎన్‌సీఈ కళాశాలల చైర్మన్ కేఎస్ రవికుమార్, ముడా డైరెక్టర్ ఆంజనేయులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెరుకుపల్లి రాజేశ్వర్ పాల్గొన్నారు. అనంతరం మంత్రి జిల్లా కేంద్రంలోని క్రౌన్ గార్డెన్ పాఠశాలలో జిల్లా ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినవిద్యార్థుల సన్మానకార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి 10/10 జీపీఏ సాధించి విద్యార్థులను మంత్రి సన్మానించారు. అనంతరం విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా మంత్రి ఆకాంక్షించారు.



విద్యార్థులను సత్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# విద్యారంగ సమస్యలపై జీపుజాత



జడ్చర్లలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 28, ప్రభాతవార్త:** విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈనెల 26న నవాబుపేట మండల కేంద్రంలో కస్తూర్బా పాఠశాలలో ప్రారంభించిన జీపుజాత శుక్రవారం జడ్చర్ల మండల కేంద్రానికి చేరుకున్నది. ఈ సందర్భంగా యాత్రకు అంబేద్కర్ చౌరాస్తాలోని జడ్చర్ల ఎస్ఎఫ్ఐ నాయకులు స్వాగతం పలికారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి హాస్టళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ మాట్లాడుతూ జిల్లాలోని 17మండలాల్లో ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర సీఎం కేసీఆర్ హామీ ఇచ్చిన కేజీ టు పీజీ ఉచిత విద్యా ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి తొమ్మిదేండ్లు గడిచినా విద్యారంగంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. జిల్లాలో కొత్తగా ప్రారంభించిన గురుకులాలకు సొంత భవనాలు లేవన్నారు. అద్దె భవనాల్లో అరకొర వసతులతో నెట్టుకొస్తున్నారని ఆరోపించారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు చాలా చోట్ల లేరని పేర్కొన్నారు. జిల్లాలో ఐదేండ్ల కిందట ప్రారంభించిన కేజీబీవీల్లో కనీసం బెంచీలు, కుర్చీలు లేవంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుందన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని చెప్పారు. యాత్రలో నాయకులు భరత్, మణికంఠ, రాధిక, మమత, శ్రీనాథ్, కార్తీక్, దస్తప్ప పాల్గొన్నారు.

## బస్టాండ్ నిర్మాణం కోసం వినతి

**మాగనూరు, జులై 28 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన బస్టాండ్ లేక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే ఆర్టీసి అధికారులు స్పందించి బస్టాండ్ ని ర్మాణం చేపట్టాలని తహసిల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ బస్సులు కూడా ఎక్కడపడితే అక్కడ ఆగుతున్నాయి కనుక మండల కేంద్రమైన మాగనూరు గ్రా మంలో తప్పకుండా బస్టాండ్ ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాలరాజు అన్నారు. బస్టాండ్ లేని కా రణంగా వేరే గ్రామాల నుండి వచ్చిన ప్రజలు కాల కృత్యాలుకు ఇబ్బందులు పడుతున్నారని వీలైనంత తొందరగా సమస్యను తీర్చాలని విన్నవించారు. జిల్లా కలెక్టర్, ఆర్టీసి అధికారులు స్పందించి బస్టాం డ్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాగనూరు మండల అధ్యక్షులు నరేష్‌కుమార్, నర్సింలు, సాకేత్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

## ప్రత్యేక తరగతులు నిర్వహించాలి

- పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం: డీఈవో రవీందర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 28, ప్రభాతవార్త:** పదో తరగతి విద్యార్థులకు మొదటి నుంచి వారాంతపు పరీక్షలు, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని డీఈవో రవీందర్ ఆదేశించారు. శుక్రవారం డీఈవో ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లోని సమగ్ర శిక్ష సమావేశ మందిరంలో సబ్జెక్టు ఫోరమ్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీఈవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థికి ఆన్‌లౌన్ ప్రోగ్రెస్ కార్డుతోపాటు రాతపూర్వక ప్రోగ్రెస్ కార్డు ఇవ్వాలని సూచించారు. జిల్లాలో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో ఆన్‌లైన్ తరగతులు నిర్వహించి జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో వినేటట్లు రూపొందించాలని నిర్ణయించారు. ప్రతి పాఠశాలలో హరితహారం నిర్వహించి న్యూట్రి గార్డెన్లు పెంచాలని సూచించారు. ప్రతి మండలాన్ని ఇక నిష్ణాతులైన ఉపాధ్యాయుడికి దత్తత ఇవ్వాలని, ఆ మండలానికి చెందిన సైన్స్ ఉపాధ్యాయులతో సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు పటాలపైఅవగాహన కల్పించేలా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు శ్రద్ధతీసుకోవాలన్నారు. విద్యార్థులకు రుచికరమైన వేడివేడి భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పాఠశాలలో గ్రంథాలయం పక్కాగా నిర్వహించాలన్నారు. సమావేశంలో సమగ్ర శిక్ష సీఎంవో బాలుయాదవ్ బైకాని, ఏఎంవో దుంకుడు శ్రీనివాస్, డీఎస్‌వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అపార్టుమెంట్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న మహిళ

**గద్వాల ప్రతినిధి, జులై 28 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలో భీంనగర్ కాలనీకి చెందిన జయలక్ష్మి భర్త సీతారాంరెడ్డి (45) జయలక్ష్మి తన భర్త సీతారాంరెడ్డి భీమ్‌నగర్‌లో నివాసముంటున్నారు. శుక్రవారం ఉదయం సమయంలో వాకింగ్ చేసేందుకు వచ్చేవారని, హైగ్రీవ అపార్టుమెంట్ ఎక్కిపై నుంచి కిందకు దూకిఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. సాయంత్రం 6గం.ల సమయంలో కూడా పోలీస్ స్టేషన్‌లో ఎవరు ఫిర్యాదు చేయలేదని తెలపడం విశేషం.

**అధిక శ్రావణమాసం రెండో శుక్రవారం**

## అమ్మవారికి అత్తరాసల వాయనం



పసుపు గౌరీ సహస్రనామం చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు

**గద్వాల ప్రతినిధి, జులై 28 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు జి. మధుమతి ప్రధాన కార్యదర్శి రవళి ఆధ్వర్యంలో అధిక శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా వాసవి మాతకు అత్రాసల వాయనం, 16 మంది ఆర్యవైశ్య మహిళలు అమ్మవారికి 33 అత్రాసలు చేసుకుని తీసుకుని వచ్చారు. శుక్రవారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పసుపు కొమ్ములతో అలంకరణ చేశారు. మహిళలు పసులతో గౌరీ సహస్ర నామం చేశారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారికి వాయనమిచ్చి లలిత సహస్ర నామ పారాయణం, పల్లకిసేవ, మహా మంగళహారతిలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గద్వాల పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ చైర్మన్ ఆలూరు బిలకంటి రాము, ప్రధాన కార్యదర్శి నరహరి, శ్రీనివాసులు, కౌన్సిలర్ కోశాధికారి బిలకంటి సురేష్‌కుమార్, యువజన సంఘం అధ్యక్షులు బాణాల వెంకటరమణ, గద్వాల ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

## జమ్ములమ్మ అమ్మవారిని దర్శించుకున్న జమ్మిచేడు ఈఓ

**మల్దకల్, జులై 28 ప్రభాతవార్త :** ఆదిశిలాక్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూలక్ష్మి వెంకటేశ్వ రస్వామి దేవాలయా న్ని శుక్రవారం జమ్మ చేడు శ్రీ జమ్ములమ్మ పరశురామ స్వామి దేవస్థానం ఈఓ పురందర్‌కుమార్ సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. శ్రీ జమ్ములమ్మ దేవాలయ ఈఓగా బాధ్యతలు తీసుకుంటు న్నందున ముందుగా మల్దకల్ దేవాలయన్ని సందర్శించుకుని పూజలు నిర్వహించగా ఆయనకు దేవాలయ ఛైర్మన్ ప్రహ్లాదరావు అర్చకులు శేష వస్త్రంతో ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## సీఐ సోమనర్సయ్యకు ఘన సన్మానం

**వెల్దండ, జులై28 ప్రభాతవార్త:** ఇటీవల వెల్దండ పోలీస్ సర్కిల్ వలయాధికారిగా బాధ్యతలు చేపట్టిన సోమ నర్సయ్యను బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షులు జంగిలి యాదగిరి ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అదే విధంగా ఎస్ఐ శ్రీనివాస్‌ను శాలువాలతో సన్మానించారు. సర్పంచ్ అంజయ్య, నాయకులు జంగిలి ప్రసాద్, భీమరాజు, చందు, వెంకట్, లింగం, వంశీ, వెంకటయ్య, చంద్రయ్య, రవికుమార్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు

**వెల్దండ, జూలై 28 ప్రభాతవార్త:** టవేరా-ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న భార్యభ ర్తలు తీవ్రంగా గాయపడిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వె ళితే... ఉప్పునుంతల మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కొమ్ము శ్రీను-శైలజలు భార్యభర్తలు, గురువారం హైదరాబాద్‌కు తమ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా రాఘాయిపల్లి గ్రామ స్టేజీ వద్ద బొలెరో వా హనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో భార్యభర్తలు తీవ్రంగా గాయపడ్డా రు. శుక్రవారం రోడ్డు ప్రమాద ఘటనపై శైలజ ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

## మైనార్టీ రుణాలకు ఇంటర్వ్యూలు

**వెల్దండ, జూలై 28 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మైనార్టీ రుణాల కోసం ధరఖాస్తు చే సుకున్న లబ్ధిదారులకు ఎం పీడీఓ శ్రీనివాస్ ఆధ్వర్యం లో శుక్రవారం ఇంటర్వ్యూ లు నిర్వహించారు. 3యూ నిట్లకై 70మంది లబ్దిదారులు మైనార్టీ రుణాల కోసం ధరఖాస్తు చేసుకోగా 52 మంది ఇంటర్వ్యూలకు హజరైనట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. బ్యాంక్ మేనేజర్లు, ఫీల్డ్ అధికారులు ఉన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థికసాయం

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 28, ప్రభాతవార్త :** జడ్చర్ల మున్సిపా లిటీ పరిధిలోని 16వ వార్డు శివాజి నగర్‌లో అరుణ అనే మహిళ మరణించారు. విషయాన్ని కౌన్సిలర్ ము న్సిపల్ చైర్‌పర్సన్ దోరెపల్లి లక్ష్మీరవీందర్‌కు తెలుపగా ఆమె వార్డుకు చేరుకొని అరుణ పార్థివదేహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చరు. ఎమ్మెల్యే సహకారంతో రూ.5వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్ర మంలో కౌన్సిలర్ చైతన్య హరికృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ ప్రదీప్, నాయకు లు బాదం మహేశ్, నరేశ్, హబీబ్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదానికి గురైన తిప్పన్నకు పరామర్శ

**ధరూర్, జూలై 28 ప్రభాతవార్త :** మండల పరిధిలోని బూరెడ్డిపల్లి గ్రా మానికి చెందిన తిప్పన్నను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి, సర్పంచ్ జ్యోతి పరామర్శించారు. తిప్పన్న ఇంటికి వెళ్లి ఆయనను పరా మర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఆమె వెంట బిఆర్ఎస్ పార్టీ నా యకులు, మహిళా నాయకురాలు రాధా మధుమతి పాల్గొన్నారు.